## ఏకరూప దుస్తువుల పంపిణీ



**వెల్దుర్తి, జూన్ 24,( సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండల పరిధి చేరిలా గ్రామంలో రెండు అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అంగన్వాడి టీచర్లు దేవలత, లక్ష్మి ఏకరూప దుస్తువులను స్థానిక సర్పంచి లావణ్య, ఉపసర్పంచి బత్తుల నవీన్ లా చేతుల మీదుగా అందజేశారు. అనంతరం అక్షరాభ్యాస, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు,, ఏకరూప దుస్తువులు,మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. అంగన్వాడికి వచ్చే చిన్నారులకు ఏకరూప దుస్తులు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉప సర్పంచ్ నవీన్ మాట్లాడాతు, అంగన్వాడి కేంద్రానికి వచ్చే చిన్నారులు ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ఏకరూప దుస్తులతో రావడం అందరూ సమానమే భావన చిన్ననాటి నుండే మొదలవుతుందని అన్నారు. అంగన్వాడి కేంద్రంలో అందజేసే పోషకాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

## ఆన్ లైన్ పనులతో విఓఏలకు పనిభారం

### రాష్ట్ర విఓఏల సంఘం కార్యదర్శి అంజనేయులు


**జోగిపేట, జూన్ 24, (సిరి న్యూస్ ):**



విఓఏలు ఎలాంటి సౌకర్యం లేకుండా ప్రభుత్వం అనేక రకాల అన్‌లైన్ పనులు చేయించడం ద్వారా పనిభారం పెరుగుతుందని రాష్ట్ర విఓల సంఘం కార్యదర్శి ఆర్.అంజనేయులు అన్నారు. ఇటీవల ఏర్పాటైన రాష్ట్ర ఐకేపి విఓఏల సంఘంలో కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తామని, అనేక సంవత్సరాలుగా చాలిచాలని డబ్బులతో వెట్టి చాకిరి చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా ఉన్న విఓఏలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ తమ సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు.గత ప్రభుత్వ హయాంలో 46 రోజుల పాటు విఓఏలు సమ్మె చేసిన సమయంలో మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.20 వేల వేతనం చెల్లిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామి ఇచ్చిందని గుర్తు చేశారు. విఓఏలకు సరైన వేతనాలు లేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అతి తక్కువ గౌరవ వేతనంతో అనేక మంది విఓఏలకు కుటుంబ భారంగా మారిందన్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికల హామీలను నేరవేర్చడంతో పాటు విఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్ర అద్యక్షుడిగా ఎన్నికైన నాగేష్‌కు అభినందనలు తెలియజేశారు.

## శ్రీ గురుపీఠం ప్రథమ వార్షికోత్సవాలు ఘనంగా ముగింపు!!!

- హిమాలయ సంత్ పరమహంస శ్రీశ్రీశ్రీ వేదానంద సరస్వతి స్వామీజీ!!
- ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి !!
- శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్, జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులు!!



**శివంపేట్ జూన్ 24 ( సిరి న్యూస్ )**

శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలోని శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ గురుపీఠం ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.హిమాలయ సంత్ పరమహంస శ్రీశ్రీశ్రీ వేదానంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో మహాపూర్ణాహుతి, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గురుపీఠాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపీఠం ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. యువత సనాతన ధర్మ విలువలను తెలుసుకొని ఆచరించాలని సూచించారు.ట్రస్ట్ ఫౌండర్ పెద్దగౌని శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ గురుభక్తి, సనాతన ధర్మ ప్రచారమే గురుపీఠం ప్రధాన లక్ష్యమని తెలిపారు. వార్షికోత్సవాల సందర్భంగా వచ్చిన భక్తులకు నిర్వహించిన అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడలతోనే శారీరక, మానసిక వికాసం

- ఆరోగ్యవంతమైన యువతతోనే దేశాభివృద్ధి.
- జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.
- డ్రగ్స్ బారినపడిన వారిని బాధితులుగానే చూస్తున్నాం.
- పునరావాస కేంద్రాల ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకొస్తున్నాం.
- డ్రగ్స్ అవగాహన వన్‌డే క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రధానం.



**మెదక్,జూన్ 24,(సిరి న్యూస్)**

మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ, వారిని క్రీడల వైపు ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన వన్‌డే క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం మెదక్‌లోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు.టోర్నమెంట్‌లో రాయల్ వారియర్స్ జట్టు ప్రథమ విజేతగా నిలిచి రూ.5,000 నగదు బహుమతి, ట్రోఫీని అందుకోగా, రాయల్ ఆవుసులపల్లి జట్టు ద్వితీయ విజేతగా నిలిచి రూ.2,500 నగదు బహుమతి, ట్రోఫీని అందుకున్నారు. విజేతలు,రన్నరప్ జట్లను అదనపు ఎస్పీ అభినందించి, టోర్నమెంట్‌లో పాల్గొన్న అన్ని జట్ల క్రీడాస్ఫూర్తిని ప్రశంసించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, యువత తమ విలువైన సమయాన్ని క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి సానుకూల కార్యక్రమాలకు కేటాయించాలని, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే తత్వాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తే అదే దేశ అభివృద్ధికి గొప్ప తోడ్పాటు. ఆరోగ్యవంతమైన యువతతోనే బలమైన సమాజం, అభివృద్ధి చెందిన దేశం నిర్మితమవుతుందన్నారు. ప్రతి యువకుడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి" అని పేర్కొన్నారు.డ్రగ్స్‌కు అలవాటు పడిన యువతను నేరస్థులుగా కాకుండా బాధితులుగా పరిగణిస్తూ, వారికి కౌన్సెలింగ్ అందించి డీ-అడిక్షన్, పునరావాస (రెహాబిలిటేషన్) కేంద్రాలకు తరలించడం ద్వారా తిరిగి సాధారణ జనజీవన ప్రవంతిలో కలిసేలా జిల్లా పోలీస్ శాఖ చర్యలు చేపడుతోందని తెలిపారు. వ్యసనాల నుంచి బయటపడాలనే సంకల్పం ఉన్న వారికి పోలీస్ శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుందని, కుటుంబ సభ్యులు కూడా అలాంటి వారిని నిర్లక్ష్యం చేయకుండా చికిత్స, పునరావాసం పొందేలా అండగా నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్, పోలీసు అధికారులు, టోర్నమెంట్ నిర్వాహకులు, యువత, క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# రాయసముద్రం చెరువు అభివృద్ధికి త్వరలో శ్రీకారం..

- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్
- రూ.12.50 కోట్లతో చెరువు సుందరీకరణ, మురుగునీటి మళ్లింపు పనులు
- త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కమిషనర్ హామీ
- రామచంద్రపురం ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపిన పుష్పనగేష్

**రామచంద్రపురం, జూన్ 24 (సిరి న్యూస్):**



రామచంద్రపురం డివిజన్ పరిధిలోని ఓల్డ్ రామచంద్రపురంలో ఉన్న రాయసముద్రం చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతూ రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మంగళవారం హైదరాబాద్‌లోని హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.రాయసముద్రం చెరువు సుందరీకరణ కోసం సుమారు రూ.10 కోట్లతో పాటు చెరువులోకి చేరుతున్న మురుగు నీటిని మళ్లించేందుకు రూ.2.50 కోట్లతో పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేసి, చీఫ్ సెక్రటరీకి లేఖను పంపించినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, సంబంధిత సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారులతో చర్చించి, హైడ్రా సమన్వయంతో అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పుష్పనగేష్ తెలిపారు.రాయసముద్రం చెరువు అభివృద్ధితో పాటు మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, చెరువు పరిసర ప్రాంతాలు సుందరీకరణతో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా రామచంద్రపురం డివిజన్ ప్రజల తరపున సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనులపై హామీ ఇచ్చిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమై రాయసముద్రం చెరువు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# డ్రగ్స్‌కు నో.. జీవితానికి యెస్

- మంజీరా జూనియర్ కళాశాలలో మెగా అవగాహన సదస్సు
- విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి
- "డ్రగ్స్ వద్దు" అంటూ ప్రతిజ్ఞ చేయించిన పోలీసులు

**రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 24 (సిరి న్యూస్):**

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పటాన్చెరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్చెరు పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక మంజీరా జూనియర్ కళాశాలలో బుధవారం "సే నో టు డ్రగ్స్.. సే యెస్ టు లైఫ్" అనే అంశంపై మెగా అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, సామాజిక దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల సాధన దిశగా పయనించాలని సూచించారు.డ్రగ్స్‌ను సేవించినా, విక్రయించినా ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ విక్రయించే వారి సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 లేదా 1908కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.అనంతరం ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో "డ్రగ్స్‌కు దూరంగా ఉంటాం.. ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతాం" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.డ్రగ్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు.




# సర్కారు బడి.. నమ్మకానికి నిలువెత్తు గుడి

- గ్రామాల్లో ప్రభుత్వ విద్యపై భరోసా పెరగాలి
- కార్పొరేట్ కు దీటుగా సర్కారు చదువులు
- న్యూ ల్యాండ్ పరిశ్రమ నిధులతో విద్య రంగానికి ఊతం
- అదనపు తరగతి గదులను
- ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**జిన్నారం జూన్ 24 సిరి న్యూస్**



జిన్నారం పురపాలిక పరిధిలోని శివానగర్ గ్రామంలో న్యూ ల్యాండ్ పరిశ్రమ 60 లక్షల రూపాయల సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించిన జడ్పీహెచ్ఎస్ అదనపు తరగతి గదులను బుధవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థల బలోపేతానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న క్షేత్రస్థాయిలో కొన్ని పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. శివానగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య అతి తక్కువగా ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యకు పెద్దపీట కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులను బలోపేతం చేయడమే లక్ష్యమని గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కష్టపడాలి అని అన్నారు. రూ.60 లక్షల వ్యాయం న్యూ ల్యాండ్ పరిశ్రమ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత సిఎస్ఆర్ నిధులనుండి 60 లక్షల భారీ బడ్జెట్ తో ఈ అదనపు తరగతి గదులను నిర్మించిందని ఆయన తెలిపారు. యాజమాన్యానికి అభినందనలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు విద్యాభివృద్ధికి తోడ్పడిన న్యూ లాండ్ పరిశ్రమ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పురపాలిక చైర్మన్ జనార్దన్ ముదిరాజ్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కృష్ణ, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కి దూరంగా ఉండాలి

## మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్



**పాపన్నపేట జూన్ 24 (సిరి న్యూస్) :**

డ్రగ్స్ బారినపడి యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, ఇకనైనా యువకులు డ్రగ్స్ కి దూరంగా ఉండాలని మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ సూచించారు. మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నివారణ పై ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులకు డ్రగ్స్ పై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. డ్రగ్స్ అనేది ఒకప్పుడు పట్టణాల్లో ఉండేదని ప్రస్తుతం పల్లెల్లోకి పాకిందని వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు కూడా కొన్ని మత్తు పదార్థాలు అలవాట్లు ఉంటాయని వాటి నుండి తమ కుటుంబ సభ్యులను దూరంగా ఉంచడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా డ్రగ్స్ నివారణలో యువత కీలకపాత్ర పోషించాలని ఆయన అన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ అమ్మకాలు కొనసాగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన వెల్లడించారు. ఆయన వెంట మెదక్ రూరల్ సిఐ కృష్ణమూర్తి పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పాపన్నపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం



**పాపన్నపేట జూన్ 24 (సిరి న్యూస్) :**



మండలం నాగ్సాన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి ప్రతాపరెడ్డి తో పాటు గ్రామ సర్పంచ్ దండెం సుశీల దుర్గేష్, ఏ ఏ పి సి చైర్మన్ చంద్రమ్మ, ఉప సర్పంచ్ సిరాజ్, కొడపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యం మరియు గ్రామ పెద్దలు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు రాజు ,సుధారాణి, శ్రవణ్ ,సందీప్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీర్, ఉపాధ్యాయులు సిద్దేశ్వర్ ,అశోక్ కుమార్ నరసింహులు, గ్రామ పెద్దలు మహిపాల్ రెడ్డి , పార్శి నర్సింహులు, ఇంద్రసేనారెడ్డి , అంగన్వాడి టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లలో ఆనంద దీపాలు..

## ఇందిరమ్మ ఇంట్లో గోగు లక్ష్మి గృహప్రవేశం..
## జెండా వెంకటాపూర్ లో కాంగ్రెస్ నేతల సందడి..
## ఎమ్మెల్యే వినోద్ ఆదేశాలతో కార్యక్రమం..
## పేదల సొంతింటి కల సాకారమంటూ నేతల హర్షం..



**మంచిర్యాల, జూన్ 24 (సిరి న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన గోగు లక్ష్మి నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి నేన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం గోగు లక్ష్మి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గురునాథం మల్లగౌడ్, గుండ్ల సోమయ్య, సర్పంచులు శరాణి తిరుపతి, దూట చంద్రయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారి రవి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జనగామ తిరుపతి, గ్రామ కార్యదర్శి చైత్ర, జెండా వెంకటాపూర్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని

# జిల్లా అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎంపీలు సురేష్ షెట్కర్, రఘునందన్ రావు
- సంగారెడ్డి కలెక్టరేట్‌లో దిశా కమిటీ సమావేశం
- జాతీయ రహదారుల నిర్మాణ జాప్యంపై అధికారులకు ఎంపీల చురకలు



**సంగారెడ్డి, జూన్ 24 (సిరి న్యూస్):**

సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం జరిగింది. ఈ భేటీలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ ప్రతీక్ జైన్, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. అమృత్ పథకం పనులు, జాతీయ రహదారుల నిర్మాణంలో జాప్యాన్ని నివారించాలని, వ్యవసాయంలో డ్రోన్ల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ముత్తంగి-సంగారెడ్డి జాతీయ రహదారి, పెద్దాపూర్ రోడ్డు పనుల జాప్యంపై అధికారుల తీరును తప్పుబట్టారు. వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. కేంద్ర పథకాలైన పీఎం స్వనిధి, కుసుం, సూర్యఘర్ యోజనలను ప్రజలకు చేరేలా చూడాలన్నారు. జిల్లాకు మంజూరైన 12 గోదాముల నిర్మాణం, ఆధునిక చేపల మార్కెట్ ఏర్పాటుకు స్థల సేకరణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పందిస్తూ.. సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, కేంద్ర పథకాల అమలుకు వేగంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- నేటి నుంచి జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభం
- జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు అవకాశం.
- అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణ
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, జూన్ 24 (సిరి న్యూస్):**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం మంగళవారం 25) నుంచి జిల్లాలో ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. ఓటరు జాబితాను మరింత కచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకే ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం, ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దడం, మార్పులు, చేర్పులు, తొలగింపులను పారదర్శకంగా నిర్వహించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ వివరించారు. ఇందులో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారని, ఈ క్రమంలో ప్రజలు వారికి అవసరమైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని, దాన్ని పకడ్బందీగా




రూపొందించడంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద, యువజన సంఘాలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా అర్హత ఉండి కొత్తగా ఓటు హక్కు పొందిన యువత తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూసుకోవాలని ప్రతీక్ జైన్ సూచించారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే దిశగా అడుగులు

- ఆరు గ్యారంటీలతో పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం.
- మెదక్ జిల్లాలో సంక్షేమ పథకాలతో వేల కోట్ల లబ్ధి:
- మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజోద్దీన్

**మెదక్,జూన్, 24(సిరి న్యూస్)**



తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తూ ఆరు గ్యారంటీల అమలుతో పేద ప్రజలకు అండగా నిలుస్తోందని మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్ ఉద్దీన్ అన్నారు.బుధవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు మేకల రవి తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా జిల్లాలో లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు.మహాలక్ష్మి పథకం కింద మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 4 కోట్ల 19 లక్షల మంది మహిళలు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారని, దీని ద్వారా మహిళలకు రూ.1,049.27 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందన్నారు.గృహ జ్యోతి పథకం ద్వారా 1,29,471 మంది వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ జీరో బిల్లులు జారీ చేశామని, ఈ పథకం కింద జిల్లాలో ప్రభుత్వం రూ.100.40 కోట్ల సబ్సిడీని భరించిందని వివరించారు. అదేవిధంగా రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కింద జిల్లాలో 1,26,961 మంది లబ్ధిదారులకు 4,68,195 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.13.18 కోట్ల సబ్సిడీ అందించిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ముఖ్యంగా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి ప్రతి కుటుంబానికి భరోసా కల్పించే దిశగా , అంగన్వాడీలో కొలువుల జాతర 15,892 ఖాళీలు పూర్తి చేసే దిశగా , ఆరు గ్యారంటీలను సమర్థవంతంగా అమలు చేస్తోందని హఫీజ్ ఉద్దీన్ పేర్కొన్నారు.

# కూకట్‌పల్లి రెస్టారెంట్‌లో కలకలం..

- కూకట్ పల్లి ట్రైన్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ షాక్..
- కిచెన్‌లో ఎలుకలు..పాచిపోయిన ఆహారం గుర్తింపు..
- 37% పరిశుభ్రతే..లైసెన్స్ రద్దుకు సిఫార్సు..
- ప్రజల ఆరోగ్యంతో ఆటలు.. యాజమాన్యానికి షోకాజ్ నోటీసు..

**కూకట్ పల్లి, జూన్ 24 ( సిరి న్యూస్ )**



హైదరాబాద్ నగరంలో ఫుడ్ సేఫ్టీ విభాగం మరోసారి కీలక చర్యలకు దిగింది. కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలోని పీఎన్ఆర్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న ప్రముఖ ప్లాట్‌ఫాం 65 ట్రైన్ రెస్టారెంట్ లో బుధవారం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, వెలుగులోకి వచ్చిన దృశ్యాలు అక్షరాలా షాకింగ్‌గా ఉన్నాయి. తనిఖీల్లో పాల్గొన్న ఫుడ్ సేఫ్టీ అధికారులు రెస్టారెంట్ వంటగదిలో అడుగుపెట్టిన వెంటనే నిర్ఘాంతపోయారు. ఎలుకలు నిర్భయంగా సంచరిస్తున్న వంటగదిలో వేలాది మంది కడుపు నింపే వంట సాగుతోందని తేలింది. ఆహార నిలువలు చాలాకాలంగా పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నది. పురుగులు, దుమ్ము, కంపు, ఇవే ఆ వంటగది గుర్తింపు చిహ్నాలుగా మారాయని అధికారులు వాపోయారు.రెస్టారెంట్ రిఫ్రిజిరేటర్లను తెరిచి చూసిన అధికారులకు మరో విషయం తెలిసింది. చాలా రోజులుగా నిలువ ఉంచిన మాంసపు పదార్థాలు పాచిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఆ పాచిపోయిన మాంసమే వంటకాల్లో వాడుతున్నారని అనుమానిస్తున్నారు. ఏళ్ళ తరబడి నమ్మకంగా భోంచేసే వినియోగదారులకు ఇది చేస్తున్న ద్రోహం అని అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మరో తీవ్రమైన ఉల్లంఘన కూడా వెలుగులోకి వచ్చింది. శాకాహార, మాంసాహార పదార్థాలను తప్పనిసరిగా వేర్వేరుగా నిలువ చేయాలని నిబంధనలు స్పష్టంగా చెప్పినా, ఆ రెస్టారెంట్‌లో రెండూ ఒకే చోట కలగలిపి ఉన్నాయి. శాకాహారులు నమ్మకంగా తింటున్న ఆహారం కూడా కలుషితమయ్యే ప్రమాదముందని అధికారులు హెచ్చరించారు. తనిఖీ అనంతరం అధికారులు నిర్వహించిన పరిశుభ్రత రేటింగ్‌లో ఆ రెస్టారెంట్ కేవలం 37 శాతం మాత్రమే సాధించింది. నిబంధనల ప్రకారం కనీసం 50 శాతం పరిశుభ్రత ప్రమాణాలు పాటించాల్సి ఉంటుందని, అందుకంటే తక్కువగా ఉంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటారని అధికారులు తేల్చిచెప్పారు.లైసెన్స్ రద్దు కోసం పై అధికారులకు నివేదిక పంపుతున్నట్టు, రెస్టారెంట్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు అధికారులు అధికారికంగా ప్రకటించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే ఒక్క అడుగు కూడా వదలం. చట్టం పరిధిలో అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటాం అని ఫుడ్ సేఫ్టీ అధికారులు రెస్టారెంట్ యాజమాన్యాన్ని నేరుగా హెచ్చరించారు..సిరి తెలుగు దినపత్రిక పాఠకులకు విజ్ఞప్తి: మీరు వెళ్ళే హోటల్, రెస్టారెంట్‌లో అపరిశుభ్రత గమనిస్తే వెంటనే, హెల్ప్‌లైన్ 1800-112-100కు ఫిర్యాదు చేయండి. మీ ఒక్క కాల్ మీ కుటుంబాన్ని కాపాడవచ్చు..



